క్లుప్తంగా

ఉద్యోగాలకు ఎంపికైన వాగ్దేవి విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: రావిపాడురోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో సోమవారం యాక్సిస్ బ్యాంక్ (బెంగుళూరు) నిర్వహించిన జాబ్ ఫెయిర్‌లో 26 మంది డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులకు రూ.4.42 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగంలో చేరాల్సి ఉంటుందని స్పష్టం చేసారు. విద్యార్థులకు తరగతి గది విద్యతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే అందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటే పోటీలకు విశేష స్పందన



వినుకొండ(నూజెండ్ల): స్థానిక గుడ్‌షఫర్డ్ ఉన్న పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో కరాటే బెల్ట్‌టెస్ట్ జాపాన్ షితోరియో కరాటే స్కూల్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కరాటే మాస్టర్ ఖాజా మొహియుద్దీన్ పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కరాటే బెల్ట్‌టెస్ట్ అంతర్జాతీయ క్రీడాకారుడు, రాష్ట్ర కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డి.ప్రభాకర్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఆరంజ్, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ లక్ష్మీ సునీత పాల్గొని వినుకొండ ప్రాంతంలో కరాటే విద్యను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటరుకు పరికరాల వితరణ



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో గ్రామస్తులు దాతలు సహకారంతో అంగన్‌వాడీ సెంటరులో చిన్నారులు వినోదం కోసం ఇనుప ఊయల, తదితర పరికరాలు ఏర్పాటు చేసినట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుందుర్తి హనుమాయమ్మ, అజయ్‌కుమార్, అభిషేక్‌లు రూ.10 వేలు విలువైన పరికరాలు వితరణ చేశారు. అంగన్‌వాడీ సెంటరులో కుర్చీలు, బల్లలు, చిన్నారుల ఆట వస్తువులు, బొమ్మలు, గణితానికి సంబంధించి చార్టులు తదతరవన్నీ గోనుగుంట్ల ప్రసాదు, గుత్తా అంజనీదేవి, ఓబూరి సుబ్బారావు, కొండ్రు నాగమల్లేశ్వరిలు రూ.12 వేలు విలువ సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సెంటరు కార్యకర్తలు వెల్లలచెరువు రాధ, సుజాత తదితరులు ఉన్నారు.

విశిష్టమైనవి డాక్టర్ రమణ సేవలు



నాదెండ్ల: 30 ఏళ్లగా ప్రభుత్వ వైద్యరంగంలో విశేష సేవలందిస్తూ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణను గణపవరం గ్రామస్తులు సోమవారం సత్కరించారు. జీజీహెచ్‌లో మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు కెల్లంపల్లి అచ్చయ్య, ట్రేడ్ యూనియన్ నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ, గణపవరం గ్రామానికి చెందిన డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ ప్రభుత్వ వైద్యుడిగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. తన స్వగ్రామంలోని స్వంతింటిని వృద్ధాశ్రమంగా మార్చి ఎందరో నీడలేని వృద్ధులకు ఆశ్రయమిచ్చారన్నారు. ప్రతినెలా గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ గ్రామస్తులకు ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పిస్తున్నారన్నారు. అంతేకాక శివాలయం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి ప్రజలకు అందించటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కాట్రు శ్రీనివాసరావు, ఆలోకం ఆంజనేయులు, కాట్రు కృష్ణారావు, మల్లాది శివశంకరరావు, కెల్లంపల్లి సింగయ్య, శివరామకృష్ణ పాల్గొన్నారు.

శనగ.. కష్టాల కనగ

- రైతును వెంటాడుతున్న నష్టాలు
- ముదురు పైరులో కాపు లేదు
- లేత పైరులో తెగుళ్లు

రొంపిచర్ల: మండలంలో ఈ ఏడాది మంచిశనగ (పుల్లశనగ) రైతులకు ఎన్నడూ లేని నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మంచిశనగ సాగు సమయం వర్షాలు తక్కువగా, మంచు ప్రభావం ఎక్కువగా ఉండే రోజుల్లోనే సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది భూమిలో శనగ విత్తనం వేసింది మొదలు వర్షాలు వెంటాడాయి. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలలో మంచిశనగ సాగు ప్రారంభించారు. ముదురు పంటగా మాచవరం, రొంపిచర్ల, నల్లగార్లపాడు, వి.రెడ్డిపాలెం, సంతగుడిపాడు, బుచ్చిబాపన్నపాలెం, గోగులపాడు, అన్నవరప్పాడు, మర్రిచెట్టుపాలెం, దాసరిపాలెం గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో సాగు చేశారు. నవంబర్ నెలలో కురిసిన వర్షాలకు పైరు అంతా ఉరక దెబ్బ తిని పాడైపోయింది. పాడైపోయిన పొలంలో తిరిగి వ్యవసాయం నిర్వహించి విత్తనాలు విత్తారు. ఆ పైరు ప్రస్తుతం పూతా, పిందె దశలో ఉంది. ముదురుగా సాగు చేసిన పైరు ఏపుగా పెరిగిందే తప్పా కాయా, పూతా రాలేదు. వర్షానికి శనగ చెట్టుకు పట్టిన పులుసు తొలగి పోవటం వల్ల కాపు రాలేదని రైతులు తెలుపుతున్నారు. డిసెంబర్ నెలలో విత్తనాలు విత్తిన శనగ పైరు మాత్రం ఏపుగా పెరిగి పూతా పిందె దశలో ఉంది. అయితే భూమిలో తేమ శాతం తక్కువగా ఉండటం వల్ల ఉదయం 10 గంటలకే బెట్టకు వచ్చి పైరు వడబడి పోతుంది. బెట్టకు తోడు ఆపైరులో డ్రైరూట్‌రాట్, విలెట్ తెగుళ్ల కనిపిస్తున్నాయి. డ్రైరూట్‌రాట్ తెగులుకు నివారణే లేదని



ఏపుగా పెరిగిన లేత మంచి శనగ పైరు

అధికారులు చెబుతున్నారు. ఈ తెగులు వేరు నుంచి వ్యాపించి చెట్టుపై వరకు వచ్చి ఎండిపోతుంది. విలెట్ తెగులైతే కాపరాక్సోక్లోరైడ్ మందును పిచికారీ చేసి నివారించుకోవచ్చు. బాగా ఉన్న పైరులో గనుపు గనుపుకు పూతా, పిందె రావటం లేదు. పడ్డా పూతా పిందె చెట్టు మధ్యాహ్నానానికి వడబడిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో కాయలో గింజ పూర్తిగా వృద్ధి చెందని ఆందోళనగా ఉంది.

ఇప్పటికే ఎకరాకు రూ.10 వేల నుం రూ.20 వేల రూపాయల వరకు ఖర్చు అయ్యింది. రెండు మార్లు విత్తిన రైతుకు రూ.30 వేల రూపాయల వరకు పెట్టుబడి అయ్యింది. కొందరు రైతులు శనగ పైరును తొలగించి ఆ స్థానంలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఈ పరిస్థితుల్లో శనగ దిగుబడి కూడా తక్కువ వస్తుందని, నష్టాలు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాపు లేక పెరిగిన ముదురు మంచి శనగ పైరు

మూడు ఎకరాల్లో సాగుచేశా



నవంబర్ నెలలో మూడు ఎకరాల్లో శనగ విత్తనాలు విత్తా. విత్తిన మూడవ రోజు నుండే ఎడతెరపి లేకుండా వర్షాలు కురిశాయి. వర్షానికి భూమిలోని శనగ విత్తనాలు మురిగి పోయాయి. పది శాతం మొక్కలు కూడా రాలేదు. అప్పటికే రూ. 25 వేల రూపాయలు ఖర్చు అయ్యింది. చేసేది లేక పైరు చెడగొట్టి మరో సారి శనగ విత్తనాలు విత్తా. పైరు అయితే బాగానే ఉంది. దిగుబడి తగ్గుతుందని ఆందోళనగా ఉంది.

–శ్రీనివాసరెడ్డి, రైతు

వాతావరణం అనుకూలంగా లేదు



శనగ పంటకు వాతావరణం అనుకూలత లేదు ఈ ఏడాది రైతులు సాగు చేసిన శనగ పంటకు వాతావరణం అనుకూలంగా లేదు. వర్షాలకు పంట దెబ్బతింది. లేత పంటలో ఎండు తెగులు కనిపిస్తుంది. భూమిలో నుంచి ఎండు పోతున్న శనగపైరుకు నివారణ చర్యలు లేవు. చెట్టు పై నుంచి ఎండిపోతుంటే బ్రైటాక్స్ మందును పిచికారీ చేసి నివారించుకోవచ్చు.

–శివలలిత, వ్యవసాయ అధికారి

వైభవంగా వసంత పంచమి

నరసరావుపేట ఈస్ట్: వసంత పంచమి పర్వదినాన్ని సోమవారం పట్టణంలోని ఆలయాలలో వైభవంగా నిర్వహించారు. శృంగేరీ శంకర మఠంలోని శ్రీశారదాంబ అమ్మవారికి, వినుకొండ రోడ్డులోని త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. శారదాంబ అమ్మవారిని పెన్నులతో అలంకరించారు. ఆయా ఆలయాలలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.



ప్రత్యేక అలంకరణలో శారదాంబ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో సరస్వతీ అమ్మవారు

5న ఉపాధి ప్రజావేదిక కార్యక్రమం

నూజెండ్ల(శావల్యాపురం): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక కార్యక్రమం ఈనెల 5న నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి జరుగుతుందని ఏపీవో ఆంజనేయరాజు సోమవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం చేత ప్రజావేదిక కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ఏమైనా అవకతవకలు జరిగితే సమగ్ర వివరాలను బహిరంగ పరచటం జరుగుతుందన్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాలు ముమ్మరంగా ఉపాధి పనులు నిధులు వినియోగంపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు అన్నీ గ్రామ పంచాయతీల్లో ఉపాధి నిధులతో చేపట్టిన నిధులు వివరాలు సామాజిక తనిఖీ బృందాలు సేకరించిన నివేదిక ఆధారంగా ప్రజావేదిక కార్యక్రమంలో వివరిస్తామన్నారు. ఇందుకుగాను రూ. 12 కోట్ల 10 లక్షల నిధులతో 792 పనులు చేసినట్లు తెలిపారు. తనిఖీలు ముగింపు దశకు చేరాయని కూలీల నగదు చెల్లింపులు, పనిప్రదేశాలు,కొలతలు, ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల పనులపై తనిఖీలు జరుగుతున్నట్లు ఎస్ఆర్‌పీ జె.ఎస్.రాజు సారథ్యంలో ఏడు గురు డీఆర్పీలు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ రాజు

మూగజీవాలపై దయాగుణం ఉండాలి

నరసరావుపేట రూరల్: మూగజీవాల పట్ల ప్రతి ఒక్కరు ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామారావు తెలిపారు. జీవ జంతు కల్యాణ్ దివస్‌ను సోమవారం సత్తెనపల్లిరోడ్డులోని ఆవుల సత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ వసంత పంచమి రోజున జీవ జంతు కల్యాణ్ దివస్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జంతు చైతన్యం గురించి అవగాహన స్థాయిని పెంచడం, ఉత్తమ జంతు సంక్షేమ ప్రమాణాలను పాటించేలా చేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ మని తెలిపారు. జంతువుల సంక్షేమ చర్యలను సక్రమంగా పాటించకపోతే దీని ప్రభావం మానవ ఆరోగ్యంపై తీవ్రంగా ఉంటుందని తెలిపారు. సత్రంలోని ఆవుల సంక్షేమానికి తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. దూడల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీలు డాక్టర్ సి.హెచ్.కోటిరత్నం, డాక్టర్ రామచంద్ర, న్యాయవాది రాధిక, సత్రం కమిటీ సభ్యులు చిలకల గురవయ్య, పి. అశోక్‌లు పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న డీడీ డాక్టర్ రామారావు, ఏడీలు డాక్టర్ కోటిరత్నం, డాక్టర్ రామచంద్రలు

మాచవరం పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

రొంపిచర్ల: మండలంలో మాచవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చాలని కోరుచూ సోమవారం గ్రామంలో అభిప్రాయ సేకరణ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు మాచవరం, నల్లగార్లపాడులో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. మాచవరం పాఠశాలను ఉన్నత పాఠశాలగా మారిస్తే తమ పిల్లలను పాఠశాల్లో చేర్పిస్తామని రాతపూర్వక పత్రాలు తల్లిదండ్రులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలను 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. 9,10 తరగతులకు నరసరావుపేటలో గల ప్రైవేట్ స్కూల్స్‌కి వెళ్ళవలసి వస్తుందన్నారు. దీని వల్ల ఆయా తరగతులకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాచవరం పాఠశాల్లో 9,10 తరగతులను ప్రవేశపెట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చాలని కోరారు. అనంతరం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్దకు వచ్చి ఎంఈఓ డి.బ్రహ్మేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చేందుకు కృషి చేస్తానని ఎంఈఓ వారికి హామీ ఇచ్చా రు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.అబ్రహం, గ్రామపెద్దలు యాంపాటి కోటిరెడ్డి, అంజిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఏఈఓ బ్రహ్మేశ్వరరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయులు, మాచవరం గ్రామస్తులు

8న చిత్రలేఖనం పోటీలు

వినుకొండ(నూజెండ్ల): జస్టిస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఆధ్వర్యంలో వినుకొండలోని విష్ణు కుండినగర్ లోని వాసవీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ భ్యూలా తెలిపారు. 5 నుంచి 10వ తరగతి విభాగాలల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదివే పోటీలల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 984846994 సంప్రదించాలని కోరారు.

మహిళా సభ్యురాలికి రూ. లక్ష రుణ సదుపాయం

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో స్వయం సహాయక గ్రూపుల్లోని ఒక్కో మహిళా సభ్యురాలికి మాత్రమే రూ. లక్ష రూపాయల వరకు వడ్డీ రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ సోమవారం తెలిపారు. చిరువ్యాపారులు జీవనోపాదులు పెంపొందించటానికి ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లక్‌దిప్ దీదీ పథకం ద్వారా అర్హత కల్గియున్న మహిళా సభ్యులకు రుణాలను సత్వరమే మంజూరు చేస్తామని, తప్పనిసరిగా యూనిట్ కూడా ఉండాలన్నారు. తోపుడు బండ్లు కూరగాయాలు, హోటల్స్, పండ్లు వ్యాపారస్తులు, బట్టల దుకాణాదారులు తదితర వారందరూ గతంలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లింపులు చేసిన వారు మాత్రమే అర్హత పొందుతారన్నారు. రుణాలు చెల్లింపులు ఆధారంగా వడ్డీరాయితీ వర్తిస్తుందన్నారు. గ్రూపు సంఘాల్లోని ఒక మహిళా సభ్యురాలికి మాత్రమే ఈ పథకం వర్తిసుందన్నారు.

బొబ్బ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



నూజెండ్ల(శావల్యాపురం): జీవాల్లో వచ్చే బొబ్బ వైరస్ నుంచి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని పశువైద్యాధికారి డి.వెంకట శివాజీ సూచించారు. సోమవారం నూజెండ్ల మండలంలోని తలార్లపల్లి గొల్లపాలెం గ్రామాల్లో జీవాలకు బొబ్బ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ గొర్రెల్లో సంభవించే షిప్ ఫాక్స్ వ్యాధి వల్ల నూరు శాతం మృత్యువాత పడతాయన్నారు. నోట్లో పుండ్లు, తోక తొడలు భాగాల్లో పుండ్లు ఏర్పడితే బొబ్బ వ్యాధి లక్షణాలన్నారు. ఈ వ్యాధి సోకిన జీవాలు 105 డిగ్రీల జ్వరంతో ఉంటుందని ఆహారం తీసుకోకపోవటం వల్ల జీవాలు బక్క చిక్కిపోతాయన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించి నివారణ చర్యలు చేపడితే ప్రాణహాని నుంచి ముప్పు తప్పుతుందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని పశుసంవర్థక సహాయకులు వద్ద టీకాలు అందుబాటులో ఉందని జీవాలదారులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా దేవాలయం వార్షికోత్సవం

నూజెండ్ల(శావల్యాపురం): శ్రీ పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వర దేవాలయ 12వ వార్షికోత్సవ వేడుకలు నూజెండ్ల మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్తులు ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేసి వేదపండితులు సర్వరామ వేద పాఠశాల ఆచార్యులు తంగిరాల వెంకట సత్య దత్తాత్రేయ యజ్ఞ శర్మ సారథ్యంలో వేదమంత్రాలతో పూర్ణాహుతి హోమాలు విశేషపూజలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం మేళాతాళాలతో ఘనంగా ఊరేగించారు. వార్షికోత్సవ వేడుకలు పూజారీ కోటేశ్వరరావు శర్మ పర్యవేక్షణ చేశారు. అనంతరం భారీ అన్నదాన సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కన్నుల పండుగ వాతావరణం నెలకొంది.



పూజలు చేస్తున్న వేదపండితులు

స్త్రీనిధి బకాయిలపై ప్రత్యేక బృందాలు

ఏజీయం రంతు చినబుల్లెయ్య

ఈపూరు(శావల్యాపురం): రాష్ట్రంలోని అత్యధికంగా పల్నాడు జిల్లాలో స్త్రీనిధి (ఎన్‌పీఏ.నిరర్థక ఆస్తులు) దీర్ఘకాలిక బకాయిలు రూ.14 కోట్లు 75 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా స్త్రీనిధి ఏజీయం రంతు చినబుల్లెయ్య వెల్లడించారు. సోమవారం ఈపూరు మండలం అంగలూరు, ఊడిజర్ల గ్రామాల్లో స్త్రీనిధి బకాయిలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్త్రీనిధి మేనేజరు (ఎండీ) ఆదేశాలు మేరకు ప్రత్యేకంగా టీమ్స్ ఏర్పాటు చేసి జిల్లాలో నిలిచిపోయిన దీర్ఘకాలిక బకాయిలు (మొండి బకాయిలు) సత్వరమే రీకవరీ చేయాలన్నారు. పల్నాడు జిల్లాలో ఈపూరు, నరసరావుపేట, వినుకొండ, యడ్లపాడు, బొల్లాపల్లి, గురజాల, పిడుగురాళ్ళ, కారంపూడి, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, రొంపిచర్ల మండలాల్లో అత్యధికంగా దీర్ఘకాలిక బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ టీమ్స్ మండలాల వారీగా సందర్శించి వెలుగు అధికారుల సమక్షంలో సమావేశాలు ఏర్పాటు చేసి రీకవరీ చేయించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈపూరు మండలంలో రూ.75 లక్షలు స్త్రీనిధి బకాయి ఉందన్నారు. దీర్ఘకాలిక బకాయిలు చెల్లింపులు చేయని వారిపై చట్టపరంగా తీసుకుంటామన్నారు. వెలుగు అధికారులు గ్రూపు సభ్యులతో మాట్లాడి బకాయిలు వసూలు చేయించాలన్నారు. ఈ టీంలో యం.ధర్మంద్ర, ఏపీయం రంగారెడ్డి, సీసీ నరేష్, రామారావు, సిలార్‌బీ, వివోలు ఉన్నారు.



మాట్లాడుతున్న చినబుల్లెయ్య

పేటలో నేతలతో మంత్రి గొట్టిపాటి భేటీ

నరసరావుపేట: జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కూటమి ముఖ్యనాయకులతో వినుకొండరోడ్డులోని నవయుగ కన్వెన్షన్‌లో జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, జిల్లా అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీధర్, పలు నియోజకవర్గాల టీడీపీ శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, భాష్యం ప్రవీణ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పరిశీలకులు మన్నవ మోహనకృష్ణ, బీజేపీ, పాల్గొన్నారు.



సమావేశమైన మంత్రి గొట్టిపాటి

కృష్ణా రివర్ స్విమ్మింగ్‌లో వెంకటేశ్వరరావు ప్రతిభ

నరసరావుపేట ఈస్ట్: కృష్ణానదిలో ఆదివారం నిర్వహించిన 25వ కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి చుక్కా వెంకటేశ్వరరావు ప్రతిభ కనపరిచి మెడల్, ప్రశంసా పత్రం సాధించారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో అసిస్టెంట్ మలేరియా అధికారిగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు 58 సంవత్సరాల వయస్సులో కృష్ణానది రివర్ క్రాసింగ్‌ను 32 నిమిషాలలో పూర్తి చేసి ప్రశంసలు అందుకున్నారు. సంఘం కార్యాలయ ఆవరణలో జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుంచాల శ్రీనివాసరావు, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న చినరామిరెడ్డి

నివేశన స్థలాలు పంపిణీ చేసే వరకూ పోరాటం

చిలకలూరిపేట: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే వరకు కూటమి ప్రభుత్వంపై పోరాటం తప్పదని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు చెప్పారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో అర్హులై పేదల నుంచి నివేశన స్థలాల దరఖాస్తులను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిర్మాణ ఖర్చులను దృష్టిలో ఉంచుకొని గృహ నిర్మాణాలకు రూ. 5 లక్షల చొప్పున అందజేయాలని కోరారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సూపర్ సిక్స్ పథకాల అమలులోనూ దాటవేత ధోరణి అవలింబిస్తున్నారని విమర్శించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఈ నెల ఐదోతేదీన తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు దాసరి వరహాలు, ముసాబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న నాయకులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

నాదెండ్ల: ఒక వేడుకలో స్నేహితులతో ఆదివారం రాత్రి పాల్గొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు కావూరు–లింగంగుంట్ల గ్రామానికి చెందిన పెనుబండ్ల వెంకటరావుకు ముగ్గురు కుమారులు. వీరు కూలిపనులకు వెళ్తుంటారు. చిన్నకుమారుడైన గణేష్ (22) ఆదివారం రాత్రి చిలకలూరిపేటలోని స్నేహితుడి ఇంట్లో జరిగిన వేడుకకు హాజరై ద్విచక్ర వాహనంపై ఉదయాన్నే తిరిగి ఇంటికి వెళ్తుండగా అప్పాపురం గ్రామ పరిధిలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న వ్యక్తులు ప్రమాదాన్ని గుర్తించి 108కు సమాచారమిచ్చారు. 108 సిబ్బంది చేరుకుని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించే లోపే మార్గమధ్యంంలఋలో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి సోమవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు గణేష్

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

నరసరావుపేటటౌన్: ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ అరుణ సోమవారం తెలిపారు. రావిపాడు గ్రామానికి చెందిన కట్టవు లాజర్ (48) పల్నాడు రోడ్డులోని కొండవీడు ఫర్టిలైజర్స్‌లో పనిచేస్తుంటాడు. గత నెల 26వ తేదీన దుకాణంలో ఎరువుల బస్తా మోసుకొని వస్తూ ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారి పడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాగులో పడి మహిళ గల్లంతు

నూజెండ్ల(శావల్యాపురం): గేదెలు తొలుకుంటూ గుండ్లకమ్మ వాగులో దిగి ప్రమాదవశాత్తు మహిళ గల్లంతైన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు మేరకు నూజెండ్ల మండలం పాత నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బిజినేపల్లి మరియమ్మ (45) రోజులాగా గేదెలు తొలుకొని సమీపంలోని గుండ్లకమ్మ వాగుకు వెళ్ళింది. ఈక్రమంలో గేదలు మోపుతుండగా గేదెలు అవతల ఒడ్డుకు వెళ్లడంతో తిరిగి గేదెలను తొలుకొని రావడానికి వాగులో దిగింది. అయితే నీటి ఉధృతి పెరగటంతో వాగులో గల్లంతైంది. విషయాన్ని చూసిన వారు గ్రామస్తులకు సమాచారం అందించగా వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే మరియమ్మ జాడ కనిపించలేదు. ఆమెకు భర్త ఏసుదాసు, ఒక బాబు ఉన్నాడు.